# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 170 | విశాఖపట్నం | 22-3-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :170 | VISAKHAPATNAM | 22-3-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram






2లో

ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి మోడీ ఫోన్..

పశ్చిమాసియా యుద్ధంపై కీలక చర్చ

వేగంగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్ సమస్య..



6లో



2లో

బ్రిడ్జి తెరిస్తారా లేదా చెప్పండి.. లేదనుకుంటే మేము తెచ్చుకుంటాం సీపీఎం డిమాండ్

# విమాన టికెట్ల ధరలపై కేంద్రం దృష్టి

## విశాఖలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు విమానయాన రంగంపై ప్రభావం చూపుతున్నాయని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. విమాన టికెట్ల ధరల పెరుగుదల విషయంలో ప్రయాణి కులపై భారం పడకుండా ఉండేలా చర్చిస్తున్నామని తెలిపారు. శనివారం విశాఖపట్నంలో రామ్మోహన్ నాయుడు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సరిహద్దుల విషయంలో చర్చలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతుందని.. జీఎమ్‌ను నియమించారని అన్నారు. కొత్తవలస - కిరండూల్(కేకే) రైల్వేలైన్ కోసం ఇంకా చర్చ జరుగుతోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. జగన్ హయాంలో రైల్వేజోన్ కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయించలేదని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టును జూన్ చివరి నాటికి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. విమానాశ్రయం ప్రారంభించే నాటికి రోడ్డు కనెక్టివిటీ (తరువాయి 2వ పేజీలో)

# తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్న

# చంద్రబాబు కుటుంబం





**తిరుమల, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. సీఎం హోదాలో నేరుగా మహాద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉన్నా.. సామాన్య భక్తునిలా వైకుంఠ క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శించుకున్నారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆ తర్వాత సీఎం కూడా శ్రీవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సీఎం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న సీఎంకు ఆలయ ఈవో, అర్చకులు మహాద్వారం వద్ద ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనుమడు దేవాన్ష్ తో కలిసి ఆలయం లోనికి వెళ్లిన సీఎం శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులకు పండితుల వేదాశీర్వచనాలు చేశారు. అనంతరం అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి పాదాల చెంత పుట్టానని, ఆయన కటాక్షం వల్లే తనకు పునర్జన్మ లభించిందని బహిరంగంగా ప్రకటిస్తూ తన ఇలవేల్పుపై భక్తిభావాలను చాటుకునే సీఎం చంద్రబాబు, భక్తిని మాటల్లోనే కాదు, ఆచరణలోనూ చూపుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నవారికి తిరుమలలో ప్రోటోకాల్ ప్రకారం మహాద్వారం నుంచి నేరుగా ఆలయ ప్రవేశానికి అవకాశం ఉంది. కానీ దేవుని ముందు అందరూ సమానమేనన్న భావనతో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో తిరుమలకు వచ్చినా క్యూ కాంప్లెక్స్ ద్వారా వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో మినహా తిరుమల వచ్చిన ప్రతిసారీ కుటుంబసమేతంగా క్యూలైన్ ద్వారానే వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నారు. తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఇదే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు.

## మధురవాడ జీవీఎంసీ జోన్-2లో


# రెచ్చిపోతున్న బిల్డర్స్

- శ్రీ బాలాజీ కన్వెన్షన్ పేరుతో అక్రమ నిర్మాణం
- టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలు నిర్మాణాలు
- మిథిలాపురి వుడా కాలనీ లో పదుల సంఖ్యలో అక్రమ కట్టడాలు
- అక్రమ కట్టడాల తో నిత్యం నరకం చూస్తున్న వాహనచోదకులు
- అడ్డగోలుగా రెసిడెన్షియల్ ఏరియా లో కమర్షియల్ నిర్మాణాలు
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- కళ్ళు నుండి కబోది గా మారుతున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది
- అదనపు అంతస్తులు నిర్మాణం చేసి కమర్షియల్ వ్యాపారం చేస్తున్న కేటుగాళ్లు
- అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతున్న జీవీఎంసీ జోన్-2 కార్యాలయం

రేపటి సంచికలో విస్తుపోయే వాస్తవాలతో ప్రత్యేక కథనం మీ పతాకం న్యూస్‌లో



అడ్డగోలుగా అక్రమ నిర్మాణం






బాలాజీ కన్వెన్షన్ పేరుతో అక్రమ నిర్మాణం

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## నిర్లక్ష్యం వద్దు..

ఇటీవల దేశంలోని వివిధ నగరాల్లో జరిగిన అగ్ని ప్రమాదాలు మన వ్యవస్థలోని భద్రతా లోపాలను ఎత్తి చూపిస్తున్నాయి. ఢిల్లీ, ఇండోర్ నగరాల్లో నివాస భవనాలు మంటల బారిన పడడం, ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు- పిల్లలు, మహిళలతో సహా విగత జీవులు కావడం విషాదకరం. ఒడిషాలోని కటక్ ప్రభుత్వాసుపత్రి ఐసియులో మంటలు చెలరేగి 12 మంది రోగులు మృతి చెందటం బాధాకరం. భద్రం అని భావించి ఇళ్లల్లో ఆదమరచి నిదురపోతున్నప్పుడు, అనారోగ్యం నుంచి బయటపడటానికి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నప్పుడు ఇలా అగ్నికీలలకు బలి కావటం... ఆయా కుటుంబాలకు తీరని దు:ఖం, పూడని వెలితి కలిగిస్తుంది. జాగ్రత్తకు, అప్రమత్తతకు చిరునామాగా ఉండాల్సిన ఐసియుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించటం చాలా ఆందోళనకరం. వాటి నిర్మాణంలోనూ, నిర్వహణ లోనూ, ప్రమాణాల పాటింపులోనూ తిష్ట వేసిన నిర్లక్ష్యానికి నిదర్శనం. అగ్ని ప్రమాదాల కారణంగా మనదేశంలో ఏటా 22 వేల మంది మరణిస్తున్నారని గణాంకాలు చెబుతు న్నాయి. సగటున రోజుకు 59 మంది మంటలకు బలవుతున్నారు. ఇందులో 66 శాతం మంది మహిళలు కావడం గమనార్హం. అగ్నిప్రమాదాల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచం మొత్తం మీద జరిగే అగ్ని ప్రమాదాల్లో ఐదింట ఒకటి మనదేశంలోనే సంభవిస్తోంది. నివాస గృహాల్లో, ఆసుపత్రి ప్రాంగణాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సంఘటనలు గతంలోనూ ఉన్నాయి. 2000 సంవత్సరం ఆగస్టులో విజయవాడలో ఒక కార్పొరేట్ హాస్పటల్ నిర్వహిస్తున్న కోవిడ్ కేర్ సెంటర్లో అగ్నిప్రమాదం జరిగి, 10 మంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది అక్టోబర్‌లో రాజస్థాన్‌లోని ఐసియులో ఇలాంటి సంఘటనే జరిగి, ఆరుగురు రోగులు మృతి చెందారు. 2024లో ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ హాస్పటల్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి, నవజాత శిశువులు చనిపోయిన దుర్ఘటన దేశం అంతటినీ కలచివేసింది. 2021లో మహారాష్ట్రలో ఇలాంటి ప్రమాదాలు రెండు నమోదయ్యాయి. 2016లో భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేటు హాస్పటల్ ఐసియులో మంటలకు 22 మంది బలయ్యారు. ఈ సంఘటన తరువాత భద్రతా ప్రమాణాల పెంపు మీద, తనిఖీల మీద దృష్టి పెట్టినట్టు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అగ్ని నిరోధక చర్యల కోసం ప్రత్యేకంగా రూ.320 కోట్లు వెచ్చించి, వివిధ రక్షణ ఏర్పాట్లు చేసినట్టు కూడా వివరించింది. అయినా, కటక్ ప్రభుత్వ ఎస్‌సిబి మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్ నిర్వహణలోని ట్రామా కేర్ సెంటర్లో అగ్ని ప్రమాదాన్ని నివారించలేకపోయారు. ఆ ఆసుపత్రి ఆవరణలోనే అగ్ని నిరోధక విభాగం ఉంది. సిబ్బంది వారికి సకాలంలో సమాచారం ఇవ్వలేదని, అందుచేత అరగంట ఆలస్యంగా మంటల నియంత్రణ, రోగుల రక్షణ చర్యలు మొదలయ్యాయని అధికారులు చెబుతున్నారు. అగ్ని నిరోధక సిబ్బంది కూడా తమ వద్ద ఉన్న ఉపకరణాలను సమర్థవంతంగా ఉపయోగించలేకపోయారని అంటున్నారు. ఆపద చుట్టుముట్టిన వేళ అప్రమత్తం కావటంలోనూ, నివారణోపకరణాలను వినియోగించటంలో తగిన తర్ఫీదు, సన్నద్ధత లేకపోవటం ఆక్షేపణీయం. చాలా సందర్భాల్లో పాలకులు సంఘటన జరిగినప్పుడు హడావిడి చేసి, ఆనక ఆ సంగతిని విస్మరించటమే ఇలాంటి దుస్థితికి కారణం. అగ్ని ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవటం, జరిగితే వెంటనే అదుపు చేసి, ప్రాణనష్టాన్ని నివారించటం ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలి. దీనికి సంబంధించి భవన నిర్మాణాలు, ఇతర ఏర్పాట్లూ ఎలా ఉండాలి? ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కర్మాగారాల నిర్వహణ ఎలా జరగాలి? అన్న దానిపై ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. వాటిని అమలు చేయటంలో అధికార యంత్రాంగపు ఉదాసీనత, మొక్కుబడి తంతు అసలు సమస్య. ప్రమాదం జరిగినప్పుడు చేసే హడావిడి ఒక వ్యవస్థాగత విధానంగా, అప్రమత్తతగా కొనసాగకపోవటం మళ్లీ మళ్లీ ప్రమాదాలు జరగటానికి తావిస్తోంది. అలాగే, మంటలను నిరోధించటానికి నీటిని మాత్రమే ఉపయోగించటం పాత పద్ధతి. కార్బన్ డయాక్సైడ్, ఫోమ్ వంటి నిప్పు నిరోధకాలను ఎక్కువగా వినియోగించాలి. తగిన సంఖ్యలో సిబ్బంది నియామకం, నైపుణ్యాల పెంపు, మాక్ డ్రిల్స్ నిర్వహణ, ప్రజల్లో అవగాహన వంటి చర్యలు కూడా చాలా అవసరం. చేతులు కాలాక ఆకులు పట్టుకోకూడదన్న పెద్దల హితోక్తిని ప్రభుత్వాలు సదా జ్ఞాపకం ఉంచుకోవాలి. ప్రాణాలు పోయాక పరిహారాలు ప్రకటించటం కాదు; ప్రమాదాలు జరక్కుండా అన్ని విధాలా అవసరమైన చర్యలు తీసుకోవాలి.

## బ్రిడ్జి తెరిస్తారా లేదా చెప్పండి.. లేదనుకుంటే మేము తెచ్చుకుంటాం సీపీఎం డిమాండ్





**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరాపల్లి బ్రిడ్జిని వెంటనే ప్రారంబిస్తారా! ప్రయాణికులను ప్రారంబించు కోమంటారా! అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు గండినాయన్ బాబు కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. శనివారం క్రిష్ణా రాయుడుపేట వద్ద బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు దేవరాపల్లి నుండి వయా అనందపురం మీదుగా వైజాగ్ వెళ్ళె మద్యలో క్రీష్ణారాయుడు పెట వద్ద బ్రిడ్జి కూలిపోయి సూమారుగా ఎనిమిది నేలలు కావ స్తుందని తెలిపారు దీన్ని ప్రయాణికులు వత్తిడితో ప్రభుత్వ కోటి రూపాయలు ఖర్చుతో పనులు పూర్తి చేసి నెల రోజులు కావ స్తున్న ప్రాంబించడానికి అదికార పార్టీ పెద్దలు అందు బాటులో లేరని నెపంతో పనులు పూర్తి అయ్యి,, నెలరోజులు అయిన బ్రిడ్జిని ప్రారంబించక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అగ్రహారం వ్యక్తం చేసారు దేవరాపల్లి నుండి ప్రతి పావు గంటకు ఒక బస్సు ఉండేదని తెలిపారు ప్రస్తుతం అత్యదిక బస్సులు వయా కె కోటపాడు మీదుగా విశాఖపట్నం వెళ్ళ వలసి వస్తుందని తెలిపారు ఆందోళనలు,ధర్నాలు చేస్తే గానీ అధికార యంత్రాగంలో చలనం వచ్చే అవకాశం లెదంటే ప్రజలను కూడా గట్టి అందోళన చేస్తామని స్పష్టం చేసారు ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితు మనుపు ఎన్నడు లెవన్నారు, రోజు వందలాది వాహనాలు ప్రయాణికులు తిరిగే అత్యంత కీలకమైన రోడ్డుపై చిన్న పాటి పని కూడా పూర్తి చేయలెని దుస్థితి ఎర్ప డిందన్నారు కల్వర్టు కుంగిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా గత డాది జూలై 21 నుంచి ఆర్టీసీ అధి కారులు విశాఖపట్నం నుంచి దేవరాపల్లి వరకు వచ్చే 12 డి, 68 డి బస్సుల రాక పోకలను నిలిపి వేశారని తెలిపారు అప్పటి నుంచి కొన్ని 12 డి బస్సులను విశాఖ నుంచి కృష్ణారాయుడు పేట వరకు మాత్రమే నడుపుతు న్నారని. అక్కడికి దేవరాపల్లి, ఆనందపురం నుంచి ఆటోల్లో చేరుకుంటూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల ప్రయాణికులు ఉద్యోగులు,వ్యాపారులు, విద్యార్థులతో ప్రజానీకం నానా అవస్థలు పడు తున్నారని పేర్కొన్నారు ప్రత్యామ్నాయంగా కె.కోటపాడు మీదుగా అర కొరగా బస్సులు నడిపినప్పటికి ప్రయాణం,సమయం ఎక్కువ అవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు అసలే అరకొరగా బస్సు సర్వీలు దీనికి తోడు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం,అవి కూడాసమయానికి రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. సాయంత్రం ఏడు గంగలు దాటితే బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెల కొందితెలిపారు. దీంతో దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ లో గంటలు కొంది బస్సులు కోసం పడిగా పులు కాస్తూ ఎనిమిది నెలలుగా నరకయాతన అను భవి స్తున్నారని తెలిపారు కూటమి నాయకులు స్వార్థ ప్రయోజనాలు కోసం ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు తెలిపారు ఇప్పటికైనా వెంటనే బ్రిడ్జిని ప్రారంబించక పోతే ప్రజలను కూడా ప్రజలు చేత ప్రారంబింప చేస్తామని వారు స్పష్టంచేశారు ఈకార్యక్రమంలో ఆర్ ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు

## ఒడిశా సరిహద్దులో బస్సు దగ్ధం.. 40 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన డ్రైవర్



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం జిల్లా రామభద్రపురం సమీపంలో శనివారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. ఒడిశాకు చెందిన రన్నింగ్ బస్సు టైర్ పేలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. నిమిషాల వ్యవధిలోనే బస్సు పూర్తిగా దగ్ధమయ్యింది. అయితే, డ్రైవర్ అప్రమత్తతతో 40 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ఒడిశా నుంచి వస్తున్న ఈ ప్రైవేట్ బస్సు రామభద్రపురం సమీపానికి చేరుకోగానే, ఒక్కసారిగా బస్సు టైర్ పేలిపోయింది. దాంతో టైర్ వద్ద మంటలు చెలరేగి, క్షణాల్లోనే అవి బస్సు మొత్తానికి వ్యాపించాయి. మంటలు గమనించి డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వెంటనే బస్సును పక్కకు నిలిపివేశారు. ప్రయాణికులకు త్వరగా కిందకు దిగిపోవాలని హెచ్చరించడంతో, బస్సులో ఉన్న 40 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వారంతా కిందకు దిగిన కొద్దిసేపటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రయాణికులు సురక్షితంగా ఉన్నప్పటికీ, బస్సులోని వారి సామాగ్రి, ఇతర వస్తువులు మంటల్లో కాలిపోయాయి. స్థానికులు సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రంజాన్ సామూహిక ప్రార్థనలో పాల్గొన్న నాదెండ్ల



**తెనాలి, పతాకం న్యూస్:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రంజాన్ ప్రార్థనలు అత్యంత ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక చెంచుపేట ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి మత పెద్దలతో కలసి సామూహిక ప్రార్థనలు ఆచరించారు. మంత్రి మాట్లాడుతూ నెల రోజులుగా కఠిన ప్రార్థనలు ఆచరించిన రంజాన్ మాసం క్రమశిక్షణ, నిష్ఠ, దాతృత్వం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా మనస్సు పవిత్రతో పాటు సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం పెంపొందుతుందని అన్నారు. మత, వర్గ, వర్ణ, భేదాలను వదిలి పరస్పర ఐక్యతతో కలసిమెలసి ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ లాంటి పండుగలు సమాజంలో ఐక్యతను బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, రంజాన్ సందేశం శాంతి, సహనం, సేవాభావం లాంటి గొప్ప విలువలను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో సంతోషం నింపాలని, అల్లా ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా ముస్లింలకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు.

## ఇరాన్ అధ్యక్షుడికి మరోసారి మోడీ ఫోన్..

### పశ్చిమాసియా యుద్ధంపై కీలక చర్చ

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం



ఉగ్రరూపం దాల్చుతున్న తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మరోసారి ఫోన్‌లో సంభాషించారు. శనివారం జరిగిన ఈ ఫోన్ కాల్‌లో మోదీ ఇరాన్ ప్రజలకు ఈద్, నౌరూజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు నేతలు ప్రాంతీయ భద్రత, స్థిరత్వంపై కీలక అంశాలను చర్చించుకున్నారు. ఇజ్రాయెల్, అమెరికాతో ఇరాన్ ఘర్షణ పూరిత వాతావరణంలో ఉన్న నేపథ్యంలో ఈ సంభాషణకు దౌత్యపరంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. "ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడాను. ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగల సమయం పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించాం" అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఇరువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చర్చల సందర్భంగా, పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికే కాకుండా, ప్రపంచ సరఫరా గొలుసులకు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, అంతర్జాతీయ వాణిజ్యానికి జీవనాడి అయిన నౌకాయాన స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం కలగకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, హర్మూజ్ జలసంధి వంటి కీలకమైన షిప్పింగ్ మార్గాలు ఎల్లప్పుడూ తెరిచి ఉండి, సురక్షితంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

(మొదటిపేజీ తరువాయి)

## విమాన టికెట్ల ధరలపై కేంద్రం దృష్టి

పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సీఐఐ వార్షిక సమావేశంలో పాల్గొనటం ఆనందంగా ఉందని తెలిపారు. సీఐఐపై సీఎం చంద్రబాబుకు అపారమైన నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. విజన్ 2047 అమల్లో సీఐఐ ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. విశాఖ వేదికగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెరిగిందని తెలిపారు. ఈనెల 23వ తేదీన మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తున్నారని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం అవుతుందని తెలిపారు. అనేక పెద్ద సంస్థలు సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడించారు. సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని తెలిపారు. ఉగాది రోజు జాబ్ క్యాలెండర్‌ను మంత్రి లోకేశ్ విడుదల చేశారని ప్రస్తావించారు. కూటమి హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి జరుగుతుందని చెప్పుకొచ్చారు. జిల్లా, మండల స్థాయిలో సీఐఐ సదస్సులు నిర్వహించాలని రామ్మోహన్ నాయుడు సూచించారు.

## తిరుమలలో అత్యాధునిక పరికరాలతో ఆహార నాణ్యత పరీక్షలు: సత్యకుమార్

వ్యవధిలోనే తిరుమలలో పరిశోధన శాలను ప్రారంభించామని తెలిపారు. ఈ పరిశోధనశాలలో అనేక పరీక్షలు చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పాలు, నెయ్యి, నూనెతో పాటు ముడి సరుకుల నాణ్యతను పరీక్షించవచ్చని చెప్పుకొచ్చారు. రూ.25 కోట్లతో నిర్మించిన ఈ పరిశోధన శాలలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ పరిశోధన శాల పని చేస్తోందని వివరించారు. అప్పటి వరకు అనాలసిస్ జరుగుతునే ఉంటుందని తెలిపారు. మూడు నెలల్లో గుంటూరు, వైజాగ్‌లో పరిశోధన శాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 11 స్టేట్ ఫుడ్ ల్యాబ్‌లను ఆధునికీకరించామని అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీపడబోమని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# నిర్వాసితుల నోట్లో మట్టి కొట్టి మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు భూమి పూజ తగదు : సీపీఎం



**నక్కపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఈనెల ఇరవై మూడున ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కు భూమి పూజ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నారు, ఈ భూమి పూజ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు వస్తున్న విషయం తెలిసిందే. కాని నేటికీ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా భూమి పూజ చేయడం అన్యాయమని శనివారం సిపిఎం జిల్లా కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాధం మాట్లాడుతూ .... ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ కొరకు భూములు, ఇల్లులు కోల్పోయిన నిర్వాసితులు సమస్యలు పరిష్కారం చేయకుండా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కు భూమి పూజ ఎలా చేస్తారని ప్రశ్నించారు, కూటమి ప్రభుత్వం మిట్టల్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ఎంత తొందరగా భూములు అప్పగిద్దాం ఏ విధమైన సేవలు చేద్దాము అనే యావ తప్ప సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఎలా ఆదుకుందామనే ఆలోచనే లేదని తెలిపారు. సిమెంట్, ఐరన్, ఇసుక, ఇటుకలు సబ్సిడీ పైన ఇస్తామని, పునాదులు కప్పు కోవడానికి గ్రావెల్, ఇంటి నిర్మాణ సమయంలో ఉచితంగా కరెంట్ అందిస్తామని హామీలు ఇచ్చిన అధికారులు మాట తప్పారని ఇది ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు. ఇచ్చిన ప్యాకేజీ రూ 8,98,000 పెరిగిన ఇంటి సామాగ్రి ధరలు వలన ఏ విధంగా ఇల్లు నిర్మించుకోవడానికి సరిపోదని రూ.25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని పోరాడినా ప్రభుత్వం పట్టించు కోలేదని, ప్రస్తుతం ఇచ్చిన ప్యాకేజీ వలన ఇల్లు నిర్మించుకోవడం సాధ్యం కాదని పూర్వం నుండి నివసిస్తున్న స్వంత ఇల్లు కోల్పోయి ఇక్కడ ఇల్లు నిర్మించుకోలేక ఇబ్బందిపడుతున్నామని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజులు మాట్లాడుతూ .... 2013 భూ సేకరణ చట్టం సెక్షన్ 32 ప్రకారం నిర్వాసితుల కాలనీలో ప్రభుత్వం విద్యా, వైద్యం, దాదాపు 25 రకాల సౌకర్యాలు కల్పించిన తర్వాతనే, నిర్వాసిత కాలనీలో ఇల్లు నిర్మించుకున్న తరువాత మాత్రమే స్వంత గ్రామంలో ఇల్లులు ఖాళీ చేయించాలన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు
## తెలిపిన ప్రభుత్వ విప్ గణబాబు



**మల్కాపురం, పతాకం న్యూస్:** విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ గణబాబు శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీహరిపురం మెయిన్ రోడ్ సమీపంలోని ఈద్గా మరియు ఖబ్రిస్థాన్ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన ముస్లిం సమాజానికి పవిత్ర రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, క్రమశిక్షణ, దాతృత్వం మరియు సోదరభావానికి రంజాన్ పండుగ ప్రతీక అని కొనియాడారు. నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, ఈ పవిత్ర రోజున అందరి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముస్లిం వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి, ముస్లిం సమాజానికి ఆయన అందిస్తున్న నిరంతర సేవలకు గాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కంబాల కొండలో ట్రెక్కింగ్ కార్యక్రమం



**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** స్థానిక సబ్బవరంలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ విశాఖపట్నం క్యాంపస్‌లో బి.టెక్. విద్యార్థుల ఆధ్వర్యంలో కంబాల కొండలో ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ట్రెక్కింగ్ కార్యక్రమానికి డాక్టర్ పట్నాయక్, శ్రీ మరియప్పన్ శివ కుమార్, శ్రీ గణపతి నాయకత్వం వహించారు. అనంతరం "మీనాస్ వీడియోస్" అనే సామాజిక చైతన్య కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్, స్త్రీ- పురుష సమానత్వం, బాల కార్మిక వ్యవస్థ, విపత్తుల నిర్వహణ, అక్షరాస్యత ప్రాధాన్యత తదితర అంశాలపై యునిసెఫ్ నిర్మించిన మీనాస్ వీడియోస్ ను వీక్షించి, వాటిపై చర్చలు జరిపి, వాటి సహాయంతో పాఠశాల చిన్నారులకు సామాజిక సమస్యలను ఎలా వివరించాలో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల లో పాల్గొన్న వారిని క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య కేశవ్ దేవ్, నావెల్ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ఆచార్య షీజా జనార్ధన్ అభినందించారు

## అభివృద్ధి పనులకు కంకర కొరత



**చోడవరం, పతాకం న్యూస్:** జిల్లాలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కంకర కొరత ఏర్పడింది. ప్రస్తుతం రహదారులు, డ్రైనేజీ కాలువలు, భవనాలు, పరిశ్రమల నిర్మాణ పనులు జోరుగా సాగుతుండడంతో పెద్ద మొత్తంలో కంకర అవసరమైంది. అయితే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వున్న క్వారీలు/ క్రషర్లలో ఉత్పత్తి చేసే కంకరకన్నా డిమాండ్ అధికంగా వుండడంతో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పనులకు పూర్తిస్థాయిలో మెటల్ అందుబాటులో వుండడంలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగియనుండడంతో ఇప్పటికే నిధులు మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీతోపాటు జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లి జోన్‌లో కూడా రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణం, మరమ్మతు పనులు జరుగుతున్నాయి. మరోవైపు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు సైతం ఊపందుకున్నాయి. ప్రభుత్వానికి సంబంధించి అత్యధిక పనులను మార్చిలోగా పూర్తి చేయాల్సి వుంది. ఇక ప్రైవేటు రంగంలో జిల్లాలోని ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో పదుల సంఖ్యలో పరిశ్రమల నిర్మాణ పనులు, రాంబిల్లి మండలంలో ఎన్‌ఏవోబీ పనులు జరుగుతున్నాయి. సీసీ రోడ్లు, తారురోడ్లకు 6 ఎం.ఎం. నుంచి, 20 ఎం.ఎం. వరకు వివిధ రకాల మెటల్‌ను వినియోగిస్తారు. భవనాల శ్లాబ్‌లకు బేబీ చిప్స్ వాడతారు. దీంతో అన్ని పనులకు వివిధ సైజుల కంకర, చిప్స్, క్రషర్ బూడిద పెద్ద మొత్తంలో వినియోగించాల్సి వస్తున్నది. కానీ జిల్లాలోని రాయి క్వారీలు, స్టోన్ క్రషర్ల నుంచి డిమాండ్ మేరకు ఉత్పత్తి జరగడంలేదు. జరుగుతున్న పనుల అవసరాల మేరకు కంకర సరఫరా కావడంలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీనివల్ల పనులు మందకొడిగా సాగుతున్నాయి. ముఖ్యంగా 6 ఎం.ఎం., 10 ఎం.ఎం., 20 ఎం.ఎం. మెటల్‌కు డిమాండ్ బాగా పెరిగింది. అవసరం మేరకు మెటీరియల్ అందకపోవడంతో పనులు త్వరగా పూర్తిచేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు.

## బూసుకొండ గ్రామంలో కార్డెన్ సెర్చ్

**సీలేరు, పతాకం న్యూస్:** జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ బూసుకొండ గ్రామంలో తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జీకేవీధి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసులు ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. ఇంట్లో ఉన్న ప్రతీ ఒక్కరి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్థులతో సీఐ సుధాకర్ సమావేశమయ్యారు.

# పార్టీలో బూత్ కమిటీలది కీలకపాత్ర
## మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయ ప్రసాద్





**మల్కాపురం, పతాకం న్యూస్ :** పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో శనివారం మాజీ శాసనసభ్యులు , పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త మళ్ళ విజయ ప్రసాద్ ,పార్టీ పరిశీలకులు డా జహీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో త్వరలో కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరగబోయే సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డోర్ టూ డోర్ ఓటర్ లిస్ట్ వేర్ఫికేషన్ ఏ విధంగా ముందుకు వెళ్ళాలని ట్రైనింగ్ పోగ్రామ్ జరిగింది. ఈ సందర్భంగా మళ్ళ విజయ ప్రసాద్ మాట్లాడుతూ బీఎల్ఏ చేయబోయే పని చాలా కీలకం. ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగింది. దాన్ని అన్వయించుకుని, మనం ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. మరోవైపు అదే టెక్నాలజీ మోసం చేయడానికి కూడా వినియోగపడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, మనం చాలా అప్రమత్తంగా పని చేయాల్సి ఉంటుంది. ఆ దిశలో మీరంతా సన్నద్ధంగా ఉండాలి. ఉన్న ఓట్లు తీసివేయకుండా, అక్రమ ఓట్లు చేర్చకుండా చాలా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. మనపార్టీ సానుభూతిపరుల ఓట్లు అక్రమంగా తొలగించకుండా చూడాలి. ఇప్పుడు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. మన ఓటర్లను కాపాడుకోవాలి. వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలి. అందుకు అవసరమైతే టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేసుకుందాం. బూత్ లెవెల్ పరిధిలో నాయకులను ఈ ప్రక్రియలో ప్రమేయం చేయాలి. ఆ విధంగా రాష్ట్ర స్థాయి నుంచి కింది వరకు ఒక పక్కా వ్యవస్థ.. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసుకుని, స్పెషల్ టాస్క్‌తో పని చేయాల్సిన అవసరం ఉందని, అలా అధికార పక్షం వారి ఆటలు సాగనీయకుండా లక్ష్యాన్ని సాధించుకోవాలని మళ్ళ విజయ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జియ్యని శ్రీధర్, బల్ల లక్ష్మణ్ రావు,గులువిందల లావణ్య,గుండపు నాగేశ్వరరావు, పిల్లా కన్న బాబు, వార్డ్ అధ్యక్షులు యలగాడ రాజు, భీశెట్టి గణేష్,గులివిందల కృష్ణ, పిన్నింటి అప్పలరాజు, పిలకా రామ మోహన్, చెంగల హరినాథ్, జియ్యని మారుతి, రేవల్ల సత్యనారాయణ, వార్డ్ పార్టీ పరిశీలకులు దొడ్డి కిరణ్, పూండి మల్లేశ్వర రావు,బోగవల్లి నాగభూషణ్, యల్లపు వెంకటేశ్వర రావు, బాకీ శ్యామ్ కుమార్ రెడ్డి, మళ్ళ శ్రీను, చుక్క పైడిరాజు, రాష్ట్ర, జిల్లా,నాయకులు, వార్డ్ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పనస రైతులకు కాసులు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** పెళ్లిళ్ల సీజన్ కావడంతో గిరిజన ప్రాంతంలో లభించే పనస కాయలకు డిమాండ్ ఏర్పడింది. కాయ సైజ్ బట్టి రూ.50 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది. దీంతో గిరిజనులు అడవి బాట పట్టి పనస కాయల సేకరణలో నిమగ్నమయ్యారు. పాడేరు మన్యానికి మైదాన ప్రాంతంతోపాటు ఒడిశా, ముంబై, కోల్‌కతా వంటి దూర ప్రాంత వ్యాపారులు నేరుగా గ్రామాలకు వాహనాలతో వచ్చి పనస కాయలు కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా రెండు నుంచి ఆరు కిలోల బరువు ఉన్న పనస కాయలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకొస్తున్నారు. పొలాలు, కల్లాలు, అటవీ ప్రాంతంల్లోని పనస చెట్లు కాపు ఆశాజనకంగా ఉండడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో పనసపొట్టు కూరకు మైదాన ప్రాంతంలో ఆదరణ ఉంది. అయితే ఏజెన్సీలో కొన్ని మండలాలలో పనస కాపు తగ్గింది. దీంతో ప్రస్తుతం పనస పిందెలకు ధర పలుకున్నదని పలువురు అంటున్నారు.

## అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి

**అనకాపల్లి, పతాకం న్యూస్:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెంలోని శ్రీ నూకాంబిక అమ్మవారిని శనివారం విశాఖ రేంజ్ ఐజీ శ్రీ గోపీనాథ్ జెట్టి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఐజీ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఐజీ ఆలయ పరిసరాలను పరిశీలించి స్థానిక పోలీస్ మరియు ఆలయ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాబోయే 90 రోజుల పాటు భక్తుల రద్దీ విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున, క్యూ-లైన్ల వద్ద ఎటువంటి తోపులాటలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తుల రక్షణ కోసం ఆలయ పరిసరాల్లోని సిసి కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా, క్యూ-లైన్లలో వేచి ఉండే భక్తులకు ఇబ్బంది కలగకుండా చల్లని తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని మరియు నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి వచ్చే రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను మరియు సహాయ కమిషనర్ యాళ్ల శ్రీధర్ గారు ఐజీ గారికి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి టౌన్ ఇన్ స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఎస్సై సంతోష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొదుపు నిధుల స్వాహా



**మెంటాడ, పతాకం న్యూస్:** మెంటాడ గ్రామంలో వరలక్ష్మీ పొదుపు సంఘానికి సంబంధించిన రూ.1.20లక్షలను బుక్‌కీపర్ లక్ష్మి పక్కదారి పట్టించిందని ఆరోపిస్తూ సభ్యు లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. బాధితుల వివరాల మేరకు.. 2023 సెప్టెంబరు 26న బ్యాంకు లింకేజీ కింద పది మంది సభ్యులు రూ.లక్ష చొప్పున రూ.10 లక్షలు రుణంగా తీసుకున్నారు. క్రమం తప్పకుండా నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్నారు. బుక్ కీపర్ లక్ష్మి.. బ్యాంకు సిబ్బందితో ఉన్న పరిచయాలను ఉపయోగించి ఆరుగురి సభ్యుల పేరుతో పొదుపు నిధుల నుంచి రూ.1.20లక్షలు తీసుకుంది. ఈ విషయం సభ్యులకు తెలియడంతో ఆమెను ప్రశ్నించారు. తిరిగి ఆ డబ్బులను బ్యాంకులో జమచేస్తామని లక్ష్మి నమ్మించి సొంతానికి వాడుకుంది. ఈ క్రమంలో గతంలో బాంకు లింకేజీ కింద వాడుకున్న రూ.10లక్షల రుణం ఇటీవల పూర్తిగా తీరిపోయింది. దీంతో గ్రూప్ సభ్యులు కొత్త రుణం మంజూరు కోరుతూ బ్యాంకుకు వెళ్లారు. పొదుపు ఖాతాలో కేవలం రూ.20 వేలు ఉందని, కొత్త రుణం ఇవ్వలేమని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో వారంతా అవాక్కయ్యారు. ఆరాతీస్తే బుక్ కీపర్ బండారం బయటపడింది. విషయం ఏపీఎం అన్నపూర్ణ దృష్టికి వెళ్లింది. విచారణలో భాగంగా ఆమె బ్యాంకు సిబ్బందిని కలిసి ఆరా తీశారు.

## ఆనందపురం జంక్షన్‌లో ఫ్లై ఓవర్

**ఆనందపురం, పతాకం న్యూస్:** ఆనందపురం జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆయన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్రరప్రసాద్‌తో కలిసి ఆనందపురం జంక్షన్, పూల మార్కెట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ మూడు నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఆనందపురం జంక్షన్ కీలకం కానున్నదని, ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎదురుకాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఇటు నగరం నుంచి, అటు అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు సాఫీగా ఎయిర్‌పోర్టుకు వెళ్లడానికి సంబంధించిన పనులు వారం, పది రోజుల్లో ప్రారంభించి రెండు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. శాశ్వత పరిష్కారంగా ఆనందపురం జంక్షన్‌లో రోడ్డును వెడల్పు చేస్తామని, ఇంకా ఏడాదిన్నర, రెండేళ్లలో సిద్ధమయ్యేలా ప్రతిపాదించిన ఫ్లై ఓవర్ నిర్మాణానికి కూడా పరిపాలనా ఆమోదం లభించిందని ఆయన చెప్పారు. పరిసరాల్లోని స్థలాలను కలిపి పూల మార్కెట్, కూరగాయల మార్కెట్‌లను విశాలమైన పార్కింగ్‌తో నిర్మిస్తామన్నారు. కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యసేవలు: డీఎంహెచ్‌వో



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఆహ్లాదకర వాతావరణమందించే దిశగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని పెదబొండపల్లి పిహెచ్‌సిని జిల్లా ఎన్‌సిడి అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి విభాగం, వార్డు, ల్యాబ్, ఫార్మసీ పరిశీలించారు. రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకొని, వారు సంతృప్తి చెందే దిశగా వైద్య సేవలు అందించాలన్నారు. హెచ్‌పివి వ్యాక్సిన్‌ను పరిశీలించారు. టీకా లక్ష్యం, ఎంతమంది బాలికలకు వ్యాక్సిన్ వేయడం జరిగిందని తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కాన్పు కోసం చేరిన అడ్మిట్ అయిన గర్భిణీ ఆరోగ్యాన్ని వార్డులో పరిశీలించారు. ఆసుపత్రి లోపల, బయట ఆవరణలను పరిశీలించారు. పిహెచ్‌సిని ఆహ్లాదకరంగా, సుందరీకరణగా తీర్చిదిద్ది ముస్తాబుకు సిద్ధం కావాలన్నారు. రోగులకు వైద్యంతో పాటుగా వారికి మానసిక ప్రశాంతత, సాంత్వన చేకూర్చే దిశగా ఆసుపత్రి వాతావరణం ఉండాలన్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా తమ వినూత్న ఆలోచనలతో ఆర్.ఆర్.బి పురంలో ఇటీవల ప్రారంభించిన పిహెచ్‌సి ముస్తాబు కార్యక్రమాన్ని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహణ తీరును పరిశీలించారు. దోమల లార్వా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వివరాలు వి.సి హెచ్ యాప్ లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జి.ధరణి, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటనాయుడు, జయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 100 పడకల ఆధునిక ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



**సాలూరు, పతాకం న్యూస్:** సాలూరు నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ, దశాబ్దాల కల నెరవేరిందని, అత్యుత్తమ వైద్య సేవలను స్థానికులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజన శాఖా మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. సుమారు రూ. 17 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల అత్యాధునిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రి పనుల పూర్తికి అదనంగా మరో కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఆసుపత్రి గిరిజన ప్రాంతాలకు సంజీవని లాంటిదన్నారు. గతంలో కేవలం 30 పడకలకే పరిమితమైన పాత ఆసుపత్రి వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, అత్యవసర పరిస్థితుల్లో విజయనగరం, విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సకాలంలో వైద్యం అందక ఒక్కోసారి ప్రాణాపాయ స్థితి వచ్చేదని అన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా సాలూరుతో పాటు పాచిపెంట, మక్కువ, రామభద్రపురం మండలాల్లోని సుమారు లక్ష మంది గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఒడిశా సరిహద్దు ప్రాంత వాసులకు కూడా ఇది అత్యవసర సేవల కేంద్రంగా మారనుందని పేర్కొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు అండగా నిలుస్తూ సుమారు రూ. 2 కోట్ల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను పరుగులు పెట్టించి, యుద్ధ ప్రాతిపదికన ఈ ఆసుపత్రిని సిద్ధం చేశామని ఆమె పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇప్పటికీ అనారోగ్యం వస్తే నాటు వైద్యం, సంప్రదాయ చికిత్సల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. అటువంటివి మాని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ మౌలిక సదుపాయాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరినప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జి.నాగభూషణ రావు, ఇతర వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోదాములు తనిఖీ



**నెల్లిమర్ల, పతాకం న్యూస్:** నెల్లిమర్లలో ఉన్న ఈవిఎం గోదాములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తనిఖీ చేశారు. మూడు నెలలకు ఒకసారి గోదాముల లోపల తనిఖీ లో భాగంగా గోదాము షట్టర్లకు అమర్చిన సీల్స్, తాళాలను తెరిపించి లోపలి గదులను, ఈవిఎం యంత్రాల నిల్వను సమగ్రంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. గోదాం పరిసర ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి, అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు, పోలీసు సిబ్బందికి సూచించారు. భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేసారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ సిహెచ్ సత్తిబాబు, ఇంచార్జి ఆర్‌డిఓ డి.వెంకటేశ్వరరావు, నెల్లిమర్ల తహశీల్దార్ టి.శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మండలస్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌కి హాజరు కావాలి



**పాడేరు, పతాకం న్యూస్:** ప్రతీ సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(మీకోసం)కార్యక్రమంలో అధికారులు విధిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)కార్యక్రమంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామ, మండల స్థాయి సమస్యలపై ప్రజలు జిల్లా కేంద్రానికి రాకూడదని, వాటిని మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ప్రతీ సోమవారం మండల కేంద్రాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించాలని, అధికారులంతా విధిగా హాజరుకావాలని, లేకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటికి కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. ఈక్రమంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల పేషీల నుంచి వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. మీకోసం అర్జీల పరిష్కార వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పీజీఆర్ఎస్ సేవలపై ప్రజల నుంచి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలను సేకరిస్తున్నదని, ఈ క్రమంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారునితో మర్యాదగా మాట్లాడి, సమస్యను పక్కాగా పరిశీలించాలన్నారు. సమస్యను పరిష్కరించకుండా ఫిర్యాదును ముగించవద్దని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డీవో ఎంవీఎస్.లోకేశ్వరరావు గిరిజనుల నుంచి 52 వినతులను స్వీకరించారు.

## ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్ కోసం మన ఊరిలోనే బాటలు వేద్దామని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజరు చంద్ర పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ విగ్రహ కూడలి వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ ప్రజలను చైతన్యపర్చే ప్రచార రథాన్ని యుటిఎఫ్ ఏర్పాటు చేసింది. ఈ రథాన్ని ఎమ్మెల్యే, డిఇఒ బ్రాహ్మజీ, యుటిఎఫ్ నాయకులు కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. తల్లి దీవెన, మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య పుస్తకాలు, దుస్తులు, వసతి గృహాలు ఇలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మజీ రావు మాటాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో పిల్లలను చదివిద్దాం. నైతిక విలువలు, రాజ్యాంగ విలువలను, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలంటే ప్రభుత్వ బడులే మంచిదని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో 12,507 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇటువంటి పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో చదివిన పిల్లలు ప్రతి అంశాన్ని వ్యాపార దృక్పథంతో చూడకుండా ఉంటారని అన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన గత రెండు నెలలుగా ప్రభుత్వ బడుల్లో పిల్లలను చదివిద్దాం.. ప్రభుత్వ బడులను కాపాడుకుందాం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగించి చైతన్య పరుస్తున్నామని చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయ గౌరీ మాటాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంకితభావంతో పని చేయడమే కాకుండా ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముందుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహనరావు, కార్యదర్శి మురళీ మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కృష్ణారావు, కె.భాస్కరరావు, ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## శతశాతం ఇళ్ల పన్నుల వసూళ్లు చేయాలి



**రామభద్రపురం, పతాకం న్యూస్:** బొబ్బిలి డివిజన్‌లోని అన్ని పంచాయతీల్లో ఈనెల 31లోగా ఇంటి పన్నులు వసూళ్లు శతశాతం చేయాలని డివిజినల్ డెవల ప్మెంట్ ఆఫీసర్ ఎం.కిరణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఇంటిపన్నుల వసూళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రామభద్రపురం మండలంలో వసూళ్ల శాతం పెంచాలని, ఇంకా రూ.17.50 లక్షలు వసూలు చేయాలని తెలిపారు. ఇంటి పన్నుల వసూళ్లకు టీములు ఏర్పాటు చేసి ఒక్కో సచివాలయం పరిధిలో ఎఫ్ఏను ఒక టీముగా, పీడీవోను ఒక టీముగా సుమారు 15 టీములు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ సర్వేలపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో డుమా ఏపీడీ రమామణి, ఎంపీడీవో రత్నం, ఈవోపీఆర్డీ వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో నాగతులసి, ఏవో సన్యాసిరావు, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు, జూనియర్ అసిస్టెంట్ చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు సమిష్టిగా పని చేయాలి: ఎస్పీ దామోదర్

**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలన, నియంత్రణకు పోలీసు, రెవెన్యూతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులు సమిష్టిగా పని చేయాలని ఎస్పీ ఎఆర్ దామోదర్ సూచించారు. శుక్రవారం ఎ.ఆర్.దామోదర్, కలెక్టరు ఎస్.రామసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నార్కోటిక్ కో-ఆర్డినేషను కమిటీ సమావేశం జూమ్ కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి వినియోగం చాలా వరకు తగ్గిందన్నారు. కానీ, జిల్లా మీదుగా సరిహద్దు రాష్ట్రాలు ఒడిస్సా, చత్తీస్ ఘడ్ నుండి ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణ జరుగుతుందని, వాటి నియంత్రణకు విస్తృతంగా తనిఖీలను ఆకస్మికంగా చేపడుతున్నామన్నారు. గంజాయి వినియోగం, అక్రమ రవాణే నియంత్రణే లక్ష్యంగా 'ఆపరేషన్ వజ్ర ప్రహార్' కార్యక్రమంతో ఎంపిక చేసిన గ్రామంలో నెల రోజులపాటు కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలను చేపడుతున్నామన్నారు.

## పాలకొండ వాసులకు ట్రాఫిక్ కష్టాలు



**పాలకొండ, పతాకం న్యూస్:** డివిజన్ కేంద్రమైన స్థానిక నగర పంచాయతీ మెయిన్ రోడ్‌లో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా పట్టించుకోవాల్సిన పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానిక చెక్ పోస్ట్ జంక్షన్ నుంచి ఎలాం జంక్షన్ వరకు ట్రాఫిక్ నిరంతరం రద్దీగా ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఇదే పరిస్థితి వెంటాడు తుంది. ముఖ్యంగా విద్యాసంస్థల ప్రారంభం, విడిచి పెట్టే సమయాల్లో ఇంకా ఎక్కువ ట్రాఫిక్ సమస్యలు ఉంటాయి. అసలే ఇరుకైన రోడ్లు, దీనికితోడు వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో రోడ్డు మీదకు వాహనం తీసుకురావాలంటే భయపడుతు న్నారు. ఇదిలా ఉండగా పట్టణంలో ఎక్కడా వాహనాల పార్కింగ్‌కు స్థలాలు గుర్తించ లేదు. గతంలో ఉన్న సిఐ విజయనంద్ పట్టణంలో మూడు చోట్ల పార్కింగ్‌కు స్థలాలు కేటాయించిన ప్పటికీ అది కనుమరుగైంది. దీంతో రోడ్డుపైన ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయడంతో రద్దీ ఎక్కువవుతుంది.రోడ్డు విస్తరణ జరిగితే మేలు స్థానిక నగర పంచాయతీలో కోట దుర్గాలయం నుంచి యాలం జంక్షన్ వరకు రోడ్డు ఇరుగ్గానే ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్య వెంటాడు తుందని స్థానికులు అభిప్రాయ పడుతు న్నారు. కేవలం 60 అడుగుల రోడ్డు మాత్రమే ప్రస్తుతం ఉంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్య కనిపిస్తుంది. ప్రజలు సహకరించాలిట్రాఫిక్ నియంత్రణకు ప్రజల సహకార కావాలి. వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుదల చేయరాదు. పాపు యజమానులు కూడా రోడ్లు మీదకు వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు అలా చేయడం సరికాదు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.డిఎస్‌పి ఎం.రాంబాబు

## 275 ఎకరాల్లో అరటి, మొక్కజొన్నకు నష్టం



**వీరఘట్టం, పతాకం న్యూస్:** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అంది వచ్చి తరుణంలో అకాల వర్షం, గాలుల కారణంగా 275 ఎకరాల్లో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మండలంలోని కంబర, కంబరవలస, దశమంతపురం, నడిమికెల్లా, చిట్టిపూడి వలసలో సుమారు 200 ఎకరాల అరటిపంటకు నష్టం వాటిల్లింది. కంబర, వీరఘట్టం, దశమంతపురంలో 75 ఎకరాల్లో మొక్కజొన్న పంట సుమారు 70మందికి పైబడి రైతులకు సంబంధించి పంట నేలకొరిగింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటల సాగు చేసినప్పటికీ గురువారం కురిసిన అకాల వర్షం కారణంగా పంటలు దెబ్బ తినడంతో ఏం చేయాలో దిక్కుతోచగా రైతులు ఉన్నారు. గతేడాది కూడా మండలంలో 200 ఎకరాలకు పైబడి అరటి, మొక్కజొన్న పంట నాశనమైనప్పటికీ నష్టపరిహారం అందలేదన్నారు.

## పేకాట శిబిరంపై దాడి



**కోనసీమ, పతాకం న్యూస్:** అమలాపురం మండలం కామన గరువు గ్రామ శివార్లలో రూరల్ ఎస్ ఐ శేఖర్ బాబు ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై శనివారం దాడి నిర్వహించారు. ఈ దాడి లో నలుగురు జూదగాళ్లను పట్టు కోవడంతోపాటు 52 పేకాట కార్డులు రూ.4,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. మండ లంలో ఇలాంటి జూద క్రీడలకు అనుమతి లేదని, ఎవరైనా వీటిని నిర్వహించిన, ఆడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

## పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలకు రికార్డు స్థాయిలో భద్రత..

### ప్రతి దశలో 2,400 కంపెనీల బలగాలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అపూర్వమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో రెండు దశల్లో జరగనున్న పోలింగ్ కోసం రికార్డు స్థాయిలో 2,400 కంపెనీల భద్రతా బలగాలను మోహరించనున్నట్లు రాత్రి ప్రకటించింది. ఏప్రిల్ 23న తొలిదశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ జరగనుంది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఇండియా రిజర్వ్ బెటాలియన్, ఇతర రాష్ట్రాల సాయుధ పోలీసులతో కూడిన ఈ బలగాలను ప్రతి దశలోనూ మోహరిస్తారు. ఇప్పటికే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా 480 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు బెంగాల్‌లో విధుల్లో ఉన్నాయి. గతంలో 2021 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున హింస చెలరేగిన నేపథ్యంలో ఈసీ ఈసారి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా భద్రతను కొనసాగించాలని నిర్ణయించింది. ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత కోసం 200 కంపెనీలు, శాంతిభద్రతల పరిరక్షణ, హింస నివారణ కోసం మరో 500 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు రాష్ట్రంలోనే ఉంటాయని స్పష్టం చేసింది. పోలింగ్ ముగిసిన తర్వాత మిగిలిన 1,700 కంపెనీల బలగాలను వెనక్కి పంపిస్తారు. బలగాల కదలికలు, మోహరింపును సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సమన్వయం చేస్తుంది. సీఆర్పీఎఫ్ వెస్ట్ బెంగాల్ సెక్టార్ ఐజీ శలభ్ మాథుర్‌ను 'స్టేట్ ఫోర్స్ కోఆర్డినేటర్'గా ఈసీ నియమించింది. ఈ బలగాలకు అవసరమైన రవాణా, వసతి వంటి ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

## రైతులకు మెరుగైన సేవలు



**విజయనగరం, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వ హయాంలో రైతులను అన్ని విధాలా ఆదుకునే చర్యలు చేపడుతున్నామని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. వైసిపి హయాంలో అన్ని రంగాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. అందువల్లే ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని అన్నారు.టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు ఎన్నో మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన 24 గంటల్లో వారి వారి అకౌంట్లో డబ్బులు జమ చేసిన మాట వాస్తవము కాదా అన్నారు. రైతులకు వైసిపి ప్రభుత్వంలో 15వేల రూపాయలు ఇస్తామని చెప్పి రూ.13,500 ఇచ్చిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రైతులకు 20వేల రూపాయలు ఇస్తామని చెప్పి అమలు చేసిందన్నారు. గతంలో జిల్లాలో 24వేల హెక్టార్లలో మొక్కజొన్న వేస్తే అది ఈసారి 50వేల హెక్టార్లకు పెరిగిందన్నారు. గతంలో హార్టికల్చర్ ఐదు శాతం వేస్తే ఇప్పుడు 10 శాతానికి పెరిగింది అన్నారు. ఖరీఫ్ సీజన్లో యూరియాకు కొంత ఇబ్బంది ఏర్పడిన మాట వాస్తవమే అయినప్పటికీ ఈ రబీ సీజన్లో రైతులకు 26 వేల టన్నుల యూరియా అవసరమైన దానికంటే 200 టన్నుల అదనంగానే ఉందన్నారు. రైతులు జీవితాలను మార్చాలంటే అది ఒక చంద్రబాబుకే సాధ్యమన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, నగర అధ్యక్షులు గంటా రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రంజక పాలనే లక్ష్యం



**రామభద్రపురం, పతాకం న్యూస్:** ప్రజా రంజక పాలనే టిడిపి కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మండల పరిధిలోని రొంపల్లిలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, వెల్నెస్ సెంటర్ భవనాలు, వంగపండువలసలో వాటర్ ట్యాంకును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలిశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజల మన్ననలు పొందడంలో ప్రభుత్వం వందశాతం విజయం సాధించిందన్నారు. ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశామని తెలిపారు. రొంపల్లి గ్రామంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బైపాస్ రోడ్డు నిర్మాణం, మూడు చెరువులకు మధుములు నిర్మిస్తామని ప్రకటించారు. వంగపండువలసకు బిటి రోడ్డు లేదా సిమెంట్ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. జూన్ నాటికి పారాది బ్రిడ్జి పూర్తిచేస్తామన్నారు. రొంపల్లిలో ఎమ్‌పి, ఎమ్మెల్యేలకు ఎంపిటిసి సభ్యులు భవిరెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు, పార్టీ నాయకులు అల్లాడ భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు, రొంపల్లి ఎంపిటిసి సభ్యులు భవిరెడ్డి శంకరరావు, పంచాయతీరాజ్ డిఇ అప్పారావు, ఎంపిడిఓ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఊపందుకోనున్న పర్యాటకం - సీ ప్లేన్ ద్వారా 10 ప్రాంతాలు అనుసంధానం



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో పర్యాటక రంగానికి కొత్త రెక్కలు సిద్ధమవుతున్నాయి. సీప్లేన్ సేవలతో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమరావతి, తిరుపతి, గండికోట వంటి కేంద్రాలతో పాటు దూర ప్రాంతాలను అనుసంధానించేలా ప్రణాళికలను రెడీ చేస్తోంది. ప్రధానంగా పీపీపీ మోడల్‌తో, కేంద్ర నిధులతో అమలు కానున్న ఈ ప్రాజెక్టు కనెక్టివిటీ లేని ప్రాంతాలను టూరిజం హాట్‌స్పాట్‌లుగా మలిచే గేమ్‌ఛేంజర్‌గా నిలవనుంది. ఏపీలో 10 ప్రాంతాలకు సీ ప్లేన్ ద్వారా అనుసంధానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. అదే విధంగా ఉడాన్ 5.5 కింద వాటి నిర్మాణానికయ్యే సుమారు రూ. 200 కోట్ల వ్యయాన్ని కేంద్రం భరించనుంది. అమరావతి, అరకు, గండికోట, కాకినాడ, కోనసీమ, లంబసింగి, నరసాపురం, రుషికొండ, శ్రీశైలం, తిరుపతిల్లో వాటి నిర్మాణానికి రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు రూపొందించింది.

ప్రధానంగా పీపీపీ విధానంలో వీటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో అమరావతి, గండికోట, తిరుపతిలో వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ప్రకాశం బ్యారేజ్ నుంచి శ్రీశైలం వరకు ప్రయోగాత్మకంగా సీ ప్లేన్ నడిపారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి వీలుగా కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పర్యావరణ, హైడ్రోలాజికల్ అంశాల ఆధారంగా అనువైన ప్రాంతాలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో ఏడింటికి మొదటి దశ పర్యావరణ అనుమతులను నిపుణుల కమిటీ మంజూరు చేసింది. తక్కువ సమయంలో ఆయా ప్రాంతాలను సందర్శించాలనుకునే వారికి సీ ప్లేన్ ప్రయాణం అనువుగా ఉండనుంది. ప్రతిపాదిత వాటర్ ఏరోడ్రోమ్‌ల డీపీఆర్‌ల పనులను ఇప్పటికే ప్రభుత్వం పలు ఏజెన్సీలకు అప్పగించింది. అవి పూర్తయిన తర్వాత ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీ చేయనున్నారు. మొదటి దశలో ప్రకాశం బ్యారేజ్ , శ్రీశైలం డ్యామ్, గండికోట రిజర్వాయర్లలో ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు ఏజెన్సీలను ఎంపిక చేసే ప్రక్రియను ఏపీఏడీసీఎల్‌ను కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది. అంతేకాకుండా మిగతా వాటిని రెండో దశలో చేపట్టనున్నారు.

అమరావతి, గండికోటల్లో ఏరోడ్రోమ్‌ల డీపీఆర్‌లను రైట్స్ సంస్థ తయారు చేస్తోంది. తిరుపతి డీపీఆర్ ప్రాజెక్టును ఫీడ్‌బ్యాక్ హైవేస్‌కు అప్పగించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పర్యావరణ ప్రభావ అంచనాను ఏపీఏడీసీఎల్ నిర్వహిస్తోంది. విశాఖలో ప్రతిపాదించిన ఏరోడ్రోమ్‌లకు రక్షణ శాఖ నుంచి ఎన్?ఓసీ కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ అందించే శాఖలు రెవెన్యూ ఆదాయ లక్ష్యాలను అధిగమించాలని, వాణిజ్య కార్యకలాపాలు, వస్తువుల, సేవల విని యోగంపై జిఎస్‌టి వసూళ్లు పక్కాగా జరగాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికా రులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని అందించే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా శాఖ, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ కలెక్టర్ కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పంచాయతీ పరిధిలో వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో, గృహ పన్నుల కంటే వాణిజ్య సంస్థల నుంచి సరైన పన్నుల వసూళ్లు జరగడం అత్యంత అవసరమని సూచించారు. ముఖ్యంగా మున్సిపాలిటీ, పంచాయితీ పరిధి వెలుపల ఉన్న పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలపై దృష్టి సారించి,తగిన విధంగా ప్రోపోర్షనల్ టాక్స్ వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పన్ను వసూళ్లలో ఏవైనా లోపాలను ఉన్నట్లు గుర్తిస్తే వాటిని వెంటనే సరిచేసే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిఎస్‌టి నంబర్ల ఆధారంగా వ్యాపార లావాదేవీలను పరిశీలించి, నాన్-జెన్యూన్ రిటర్న్ ఫైలర్స్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయాలకు సంబంధించి ప్రత్యేక మానిటరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకొని రోజువారీ పురోగతిని సమీక్షించాలని పేర్కొన్నారు. అన్ని శాఖల నుంచి ప్రతి వారం బిల్లుల ప్రాసెసింగ్‌కు సంబంధించిన సమాచారం సేకరించి, కమర్షియల్ టాక్స్ శాఖతో పంచుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, సమాచార మార్పిడిని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఏ శాఖ నుంచి సహకారం లోపించినా, వెంటనే మానిటరింగ్ విభాగానికి తెలియజేసి లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యాచరణ అంశాలపై అన్ని శాఖలు సమగ్ర నివేదికను సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థతను పెంపొందించడంతో పాటు ఆదాయ వృద్ధి సాధించడం లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మైన్స్ తదితర ఆదాయ వనరుల శాఖలు తమ లావాదేవీలను క్రమబద్ధంగా నమోదు చేసి పన్ను చెల్లింపులను నిర్ధారించి ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. జిఎస్‌టి వసూళ్లపై పెండింగ్‌లో ఉన్న బకాయిలు, కేసుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖలు, కాంట్రాక్టర్లు నుండి రావలసిన వసూళ్లకు సంబంధించిన వివరాలను వివిధ శాఖల అధికారులు జిఎస్‌టి శాఖ అధికారులకు అందజేసి సమన్వయంతో కలిసి పనిచేసి జిఎస్‌టి వసూళ్లపై పెండింగ్ జిఎస్‌టి బకాయాలను సమీక్షించుకొని వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌పై అవగాహన పెంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటూ రెవెన్యూ ఆదాయ శాఖల్లో వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ కు ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ, జిఎస్‌టి, డిపిఒ, బిఎస్‌డబ్ల్యూఒ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, మైనింగ్, అటవీ శాఖ, మదనపల్లి, పుంగనూరు, బి.కొత్తకోట మున్సిపల్ అధికారులు, ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడి మృతి



**నంద్యాల, పతాకం న్యూస్:** ప్యాపిలి మండలం గోపాలనగరం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికులను కలిచివేసింది. గోపాలనగరం గ్రామానికి చెందిన చాకలి ఎర్రగొండ వెంకట కృష్ణ (32), ఊటకొండ గ్రామంలోని చెరువుకు ఈత కోసం వెళ్లారు. అయితే నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం 10:45 గంటల సమయంలో వెంకట కృష్ణ మృతదేహం నీటిపై తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తహశీల్దార్ కార్యాలయ వర్గాలు ఘటనపై వివరాలు సేకరించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున భరోసా కల్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట కృష్ణ మరణ వార్త తెలిసిన వెంటనే డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ వద్ద ఉన్న మృతదేహానికి ఆయన నివాళులర్పించారు.

## నైట్ పెట్రోలింగ్ ముమ్మరం



**కడప, పతాకం న్యూస్:** కడప జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేసినట్లు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. తాళాలు వేసిన ఇళ్లు, దేవాలయాలు, ఏటీఎంలు వ్యాపార సముదాయాల వద్ద చోరీలు జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బంది నుండి డీఎస్పీల వరకు రాత్రివేళ గస్తీని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలను నిశితంగా తనిఖీ చేయడంతో పాటు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగకుండా ఆధార్ కార్డులను పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఉంచారు. ముఖ్యంగా పాత నేరస్తుల కదలికలపై మొబైల్ చెక్ డివైజ్ ద్వారా నిఘా పెంచుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై మరియు అకారణంగా తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తెల్లవారుజామున వాహనదారుల కోసం 'స్టాప్ అండ్ వాష్' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తున్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలపై చర్చలు జరపాలి




**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ ప్రభుత్వం సామాన్య ఆసుపత్రి, రంగరాయ మెడికల్ కళాశాలలో సేవలందిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ జీతాలు, సెలవులు, ఇతర సమస్యలపై కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం తక్షణమే చర్చలు జరపాలని సిఐటియు డిమాండ్ చేసింది. జిజిహెచ్ మెయిన్ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ 2025 జూన్ 1 నుంచి జిజిహెచ్, ఆర్ఎంసిల్లో సెక్యూరిటీ నిర్వహణ కాంట్రాక్టు పొందారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ చెల్లిస్తూ సెక్యూరిటీ గార్డ్స్‌కు నెలకు రూ.13,960 చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.12,099 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. చాలా కాలంగా అమలవుతున్న క్యాజువల్ లీవులు రద్దు చేసి కార్మికుల జీతాల్లో కోత విధిస్తున్నారన్నారు. సిఐటియులో చేరిన సెక్యూరిటీ గార్డ్స్‌ను విధులకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై ఇప్పటికే జిజిహెచ్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్లకు రాతపూర్వకంగా తెలిపామన్నారు. వారు జోక్యం చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో మార్చి 25 నుండి జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, నక్కెళ్ల శ్రీనివాస్, సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్.ధర్మ, కె.భాగ్యలక్ష్మి, యూనియన్ సభ్యులు, మీసాల ఆదినారాయణ, ఎస్.సోమరాజు, ఎ.శ్రీనివాస్, వి.బాలరాజు, దేవి పాల్గొన్నారు.

## వ్యాధి లక్షణాలను త్వరగా నిర్ధారించాలి

**సీతానగరం, పతాకం న్యూస్:** ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే సర్వే, స్క్రీనింగ్‌ల్లో వైద్య సిబ్బంది గుర్తించిన వ్యాధి లక్షణాల నిర్ధారణ త్వరగా జరిగేలా వైద్యాధికారులు కార్యాచరణ చేయాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. మండలంలోని నీలకంఠాపురంలో సంచార చికిత్సాశిబిరాన్ని తనిఖీ చేశారు. మందులు, వైద్య పరీక్షలు పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. సర్వే, స్క్రీనింగ్‌లు ఏ మేరకు పూర్తి చేశారో ఆన్‌లైన్ నమోదు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి ముస్తాబు, ఇతర ఆరోగ్య అంశాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, క్యాన్సర్ లక్షణాలు గుర్తించే లక్ష్యంగా ఎన్‌సీడీ సర్వే, 4డీ లక్షణాలపై ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్‌లో గుర్తించిన వారికి సంచార చికిత్సా శిబిరాల్లో ఎప్పటికప్పుడు వైద్యాధికారులు నిర్ధారణ జరిపి తదుపరి చికిత్స, పర్యవేక్షణ జరిగేలా త్వరగా కార్యాచరణ చేయాలన్నారు

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి



**గుంటూరు, పతాకం న్యూస్:** అకాల వర్షాలు, ఈదురు గాలులకు జిల్లాలోను, పెదకాకాని మండలంలోని అనేక చోట్ల మొక్కజొన్న చేతికొచ్చే సమయంలో నేలవాలి రైతులకు నష్టం జరిగిందని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు సత్వరమే పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ మండలంలోని తక్కెళ్ళపాడు, పెదకాకాని, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో పొలాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులు ఎకరాకు కౌలు కాకుండా రూ.35 వేలు ఖర్చుచేశారని చెప్పారు. కళ్లాల్లోని మిర్చి, పసుపు తడవగా అరటి పొలాలు పడిపోయాయని అన్నారు. శనగ పంటచేతికి వచ్చిందని, అయితే కేంద్ర ప్రభుత్వం దిగుమతులపై పన్నులు తగ్గించడం వల్ల విదేశాల నుండి శనగలు దిగుమతి అవుతున్నాయని, ఫలితంగా రైతుల వద్ద వున్న శనగలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంలేదని విమర్శించారు. గతేడాది పండిన శనగలు ఇప్పటికీ రైతుల వద్దనే వున్నాయని, ప్రభుత్వం స్పందించి శనగల దిగుమతిని నిలిపేసి, రైతుల వద్ద ఉన్న శనగలను మద్దతు ధరకు కొనాలని కోరారు. అన్ని మండల కేంద్రాల్లో శనగ, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మొక్కజొన్న క్వింటాళ్ రూ.2400కు కొనాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్.శివాజీ, మండల నాయకులు రాజారమేష్ పాల్గొన్నారు.

## ఈద్గాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు

**కడప, పతాకం న్యూస్:** వైఎస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ జిల్లాలో, పండుగ వేళ ముస్లిం సోదరులకు పోలీస్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రాకపోకలకు ఆటంకం లేకుండా పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతూ, శాంతియుత వాతావరణంలో పండుగ జరిగేలా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

## మొక్కజొన్నను మద్దతుధరకు కొనాలి




**బాడంగి, పతాకం న్యూస్:** మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని మండలంలోని పాల్తేరు గ్రామంలో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేసినట్లు తెలిపారు. దిగుబడులు కూడా మంచి స్థాయిలో వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాకు రూ.1600 నుంచి రూ.1700 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2400 ఉన్నప్పటికీ రైతులకు ఆ ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్దతుధర ప్రకటించడమే తప్ప తమ సంస్థల ద్వారా మార్కెట్లో జోక్యం చేసుకుని రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దీంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతుధరకు మొక్కజొన్నను కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. ఇటీవల ఈదురు గాలులు, అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్తేరు గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

## నూకాంబికా ఆలయ ఈవోకు ఘన సత్కారం

**ఆలమూరు, పతాకం న్యూస్:** చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరిని గ్రామానికి చెందిన మహిళలు, నాయకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఆలయంలో తూర్పు, పడమర రాజగోపురాల నిర్మాణానికి, ముఖమండపం, ప్రాకార మండపం తదితర అభివృద్ధి పనులకు సంకల్పం చేసి ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో పూర్తి చేయడంలో ఈవో పాత్ర ప్రశంసనీయమని వారంతా కొనియాడారు. తూర్పురాజగోపురం నిర్మాణదాత దాసరి గణేశ్వర్రావు తండ్రి దాసరి వెంకట్రావు (బాబూరావు)ను వారంతా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ వీరి అప్పారావు గౌడ్, ఆలయ మాజీ చైర్మన్ మైక్లా శేషుబాబు సభ్యులు గన్ని చిన్నబ్బు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ పవన్, అటెండర్ వీరన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్ సమస్య..!



వేగంగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్ సమస్య.. ఆహారంలో మార్పులు చేసుకోవడం అవసరం.. ఫ్యాటీ లివర్ అంటే లివర్ కణాల్లో కొవ్వు ఎక్కువగా పేరుకుపోవడం. ఇది భారత్‌లో వేగంగా పెరుగుతున్న అనారోగ్య సమస్యల్లో ఒకటి. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయకపోవడం, మద్యపానం వంటి వాటిని ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఫ్యాటీ లివర్ అంటే లివర్ కణాల్లో కొవ్వు ఎక్కువగా పేరుకుపోవడం. ఇది భారత్‌లో వేగంగా పెరుగుతున్న అనారోగ్య సమస్యల్లో ఒకటి. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయకపోవడం, మద్యపానం వంటి వాటిని ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఫ్యాటీ లివర్ సమస్యను సరైన సమయంలో నియంత్రించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. అయితే సరైన ఆహారం, జీవనశైలి మార్పులతో ఈ సమస్యను నియంత్రించవచ్చు. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గడానికి సహాయపడే ఉత్తమ ఆహారాలను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా సమస్య తగ్గడంతో పాటు కాలేయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

రోజుకు మూడు కప్పులు బ్లాక్ కాఫీ చక్కెర లేకుండా తాగడం వల్ల లివర్ ఎంజైమ్ స్థాయిలు తగ్గుతాయి. లివర్ ఎంజైమ్ స్థాయిలను తగ్గించడంలో కాఫీ సహాయపడుతుంది. అలాగే లివర్ వాపు, ఫైబ్రోసిస్, సిరోసిస్ ప్రమాదాన్ని కూడా కాఫీ తగ్గిస్తుంది. కాఫీలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ లివర్ కణాలను రక్షించడంలో దోహదపడతాయి. బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ, స్ట్రాబెర్రీ వంటి పండ్లలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి లివర్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ పండ్లను రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి దీర్ఘకాలిక కాలేయ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. అలాగే ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు పాలీఫినాల్స్ ఉంటాయి. ఇది లివర్‌లో కొవ్వు తగ్గించడంలో, మెటాబాలిజం మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అదే విధంగా బాదం, ఆక్రోట్, పిస్తా వంటి నట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. రోజూ వీటిని తగిన మోతాదులో తీసుకోవడం ద్వారా మెటాబాలిక్ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఫ్యాటీ లివర్ ప్రమాదం కూడా తగ్గుతుంది.

ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో ఆకుకూరలు, కూరగాయలు కూడా ఎంతో సహాయపడతాయి. ఆకుకూరలు లివర్‌లో కొవ్వు పేరుకుపోవడాన్ని, వాపులను తగ్గిస్తాయి. పాలకూర, కేల్, బ్రోకలీ, క్యాబేజీ, కాలిఫ్లవర్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి ఆహారాలను తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్య తగ్గడంతో పాటు కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇక ఫైబర్, మొక్క ఆధారిత ప్రోటీన్, నెమ్మదిగా జీర్ణమయ్యే కార్బొహైడ్రేట్స్‌కు మంచి మూలం. ఫైబర్ ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి గట్ మైక్రోబయోమ్‌ను (మంచి బ్యాక్టీరియా) బలోపేతం చేస్తుంది. ఇది ఫ్యాటీ లివర్ నియంత్రణకు ఉపయోగపడుతుంది. వీటితో పాటు బీట్‌రూట్‌ను తీసుకోవడం ద్వారా కూడా ఈ సమస్య నుండి సులభంగా బయటపడవచ్చు. బీట్‌రూట్‌లో ఫైబర్, నైట్రేట్స్, బెటలైన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి లివర్ పనితీరును మెరుగుపరచడంలో, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విధంగా చిన్న చిన్న ఆహారపు మార్పులు రోజువారీ జీవనశైలిలో చేర్చుకుంటే కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించుకోవచ్చు.

## ఇరాన్‌లోని నతాంజ్ అణుకేంద్రంపై మరోసారి దాడి



**ఇరాన్:** ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులు చేశాయి. ఈ మేరకు స్థానిక మీడియా వెల్లడించింది. అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు జరిగాయని తస్నిమ్ వార్తా సంస్థ తెలిపింది. అయితే రేడియా ధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల నివాసితులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని పేర్కొంది. నతాంజ్ అణుశుద్ధి కర్మాగారంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ ఖండించింది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. తాము జరిపిన దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం జరిగిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజామిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఈ నెల ప్రారంభంలో కూడా నతాంజ్ అణుశుద్ధి కర్మాగారంపై ఒకసారి దాడి జరిగింది.

### మా జోలికి రావొద్దు... బ్రిటన్‌కు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

అమెరికా-ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, బ్రిటన్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడి చేసేందుకు అమెరికా దళాలకు బ్రిటన్ తన సైనిక స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతి ఇస్తోందన్న నివేదికల నేపథ్యంలో ఇరాన్ శనివారం తీవ్రంగా స్పందించింది. ఈ వివాదంలో బ్రిటన్ జోక్యం శ్రుతి మించితే, ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ చేశారు. "ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న ఈ యుద్ధంలో భాగం కావాలని బ్రిటన్ ప్రజల్లో అధిక శాతం మంది కోరుకోవడం లేదు. కానీ, వారి ప్రధాని స్టార్మర్ మాత్రం సొంత ప్రజల అభిప్రాయాన్ని విస్మరించి, ఇరాన్‌పై దాడికి యూకే స్థావరాలను వాడేందుకు అనుమతిస్తున్నారు. తద్వారా ఆయన బ్రిటిష్ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ హక్కును వినియోగించుకోవడానికి ఇరాన్ వెనుకాడదు" అని అరాఘ్చి తన పోస్టులో పేర్కొన్నారు.

# అధికారుల పర్యవేక్షణ లోపం.. అరకులోయ ఏకలవ్య గురుకులానికి శాపం



**అరకులోయ, పతాకం న్యూస్:** పాడేరు మన్యంలోని 11 మండలాల్లో 11 ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికి రెండు విడతల్లో ఒక్కొక్క పాఠశాలకు రూ.40 కోట్లు మంజూరు చేసింది. అరకులోయ మండలం బొండాం పంచాయతీ మజ్జివలస గ్రామ సమీపంలో ఏకలవ్య గురుకుల పాఠశాలకు 15 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. దీంతో తొలి విడత మంజూరైన రూ.20 కోట్లతో 2021-22 సంవత్సరంలో భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. పనులు చకచకా సాగుతున్న సమయంలో బిల్లుల మంజూరులో జాప్యంతో ఎనిమిది నెలలపాటు జాప్యం ఏర్పడింది. అనంతరం బిల్స్ కావడంతో దాదాపు పనులు పూర్తిచేసి ఇంటర్నల్ రోడ్స్, ప్లంబింగ్ పనులు, కిచెన్‌కు సంబంధించిన పనులు మిగిలి ఉండగానే ఏడాదిన్నర క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాటశాలలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. దీంతో అరకొర సౌకర్యాలతో అరకులోయలో ఐటీడీఏ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో(వైటీసీ) ఉన్న అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ 'ఏకలవ్య' విద్యార్థులు ఎంతో ఆనందపడ్డారు. అన్ని సౌకర్యాలతో కూడిన పాటశాల, వసతి గృహానికి వెళ్లిపోతామని ఆశపడ్డారు. కానీ ఆశలు నేటి వరకు నెరవేరలేదు. ఒక్క డుంబ్రిగుడ ఏకలవ్య గురుకుల పాఠశాలకు సొంత భవనాలు సమకూరడంతో అక్కడి విద్యార్థులు వెళ్లిపోయారు. అయితే వైటీసీలో ఇంకా అరకులోయ, అనంతగిరి విద్యార్థులు వైటీసీలో నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానమంత్రి ప్రారంభించిన సమయానికి ప్రధాన భవనం, బాల,బాలికలకు సంబంధించిన వసతిగృహం, వార్డెన్, మెట్రిన్‌ల నివాసగృహాలు, డైనింగ్ హాల్, కిచెన్‌లకు సంబంధించిన భవనాలు, ప్రహరీ, నీటిసౌకర్యం పూర్తయ్యాయి. అయినా నేటికీ ఆ భవనాలను అందుబాటులోకి తీసుకురాలేదు. కారణమేమిటంటే.. తొలి దశలో చేపట్టిన పనులకు అదనంగా రూ.రెండు కోట్లు ఖర్చు అయ్యిందని, అదనపు వ్యయం బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ ఆ భవనాలను అధికారులకు అప్పగించలేదు. ఇటీవల పెండింగ్ బిల్లులు చెల్లించడంతో మొదటిదశకు సంబంధించిన ప్లంబింగ్, కిచెన్‌లో అధునాతన మిషనరీని ఏర్పాటు చేసే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకు అప్పగిస్తామంటున్నా పనులు పూర్తిచేసే పరిస్థితి కనిపించడంలేదు. ప్లంబింగ్, కిచెన్ పనులు పూర్తి చేసినా ఇంటర్నల్ రోడ్స్ పూర్తిచేసే పరిస్థితి కనిపించడం లేదు. వచ్చే విద్యాసంవత్సరానికి అయినా అరకులోయ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల భవనాలు అందుబాటులోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే ఈ భవన నిర్మాణాల తీరును అటు గురుకుల సొసైటీ అధికారులుగానీ, జిల్లా యంత్రాంగం గాని పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చేపడితే త్వరితగతిన పూర్తవుతాయని తల్లిదండ్రులు అంటున్నారు. ఇంటర్నల్ రోడ్లు రెండో విడత మంజూరైన భవన నిర్మాణాలతోపాటు చేపడతారని కాంట్రాక్టర్‌కు సంబంధించిన సైట్ ఇన్‌చార్జీలు చెబుతున్నారు.

గత ఏడాది నుంచే రెండో విడత భవన నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ముఖ్యంగా బాల,బాలికల వసతిగృహాల భవనాలు, 20కి పైగా ఉపాధ్యాయులు,సిబ్బంది నివాసగృహాల భవనాలు, ప్రిన్సిపాల్ నివాసగృహం భవనాలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ పనులను నిర్ణీత గ డువులోగా పూర్తిచేసే విధంగా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.




# వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా బీసీసీఐ మాస్టర్ ప్లాన్..



వన్డే ప్రపంచకప్ 2027 టోర్నమెంట్‌కు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ మెగా టోర్నీ కోసం సుమారు 20 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాబబుల్స్ జాబితాను సెలక్టర్లు ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా గమనించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పీటీఐ ఒక కథనంలో పేర్కొంది. సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎస్‌ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ప్రగ్యాన్ ఓఝా.. ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా స్టేడియాల్లోనూ, టీవీల్లోనూ పర్యవేక్షిం చనున్నారు. ప్రతీ వారం కనీసం ఐదు మ్యాచ్‌లను కవర్ చేసేలా, ఒక్కో సెలక్టర్ ఒక్కో మ్యాచ్‌కు హాజరయ్యేలా ప్రణాళిక రచించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ పర్యవేక్షణ కేవలం వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని మాత్రమే జరుగుతుందని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ లేదా టీ20 ప్రపంచకప్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పష్టమైంది.

సెలక్టర్లు ప్రధానంగా జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లపై దృష్టి సారించనున్నారు. మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న హర్షిత్ రాణాకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు జూన్ 6 నుంచి 10 వరకు ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు పూర్తిస్థాయి జట్టును పంపాలని బీసీసీఐ భావిస్తోంది.

ఈ మ్యాచ్‌కు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు లేనప్పటికీ, దీనిని తేలిగ్గా తీసుకోవడం లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు భారత్ తొమ్మిది టెస్టులు ఆడాల్సి ఉన్నందున, ఈ మ్యాచ్‌లో కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ సమయంలో గాయపడకపోతే బుమ్రా, సిరాజ్ కూడా ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టు ఆడే జట్టులో ఉంటారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. "భారత టెస్టు జట్టు ప్రయోగాలకు వేదిక కాదు. దానికోసం ఇండియా-ఏ పర్యటనలు ఉన్నాయి. ప్రస్తుతం టెస్టుల్లో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ మా మొదటి ప్రాధాన్యత" అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.

## ఐర్లాండ్ పర్యటనకు టీమిండియా.. షెడ్యూల్ రిలీజ్



టీమిండియా జట్టుకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ బయటకు వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్ పర్యటనకు భారత జట్టు వెళ్లనుంది. ఈ టూర్ లో భాగంగా ఆతిథ్య జట్టుతో రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్ లో టీమిండియా తలపడనుంది. తాజాగా ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ శనివారం అధికారికంగా విడుదల చేసింది. ఈ రెండు మ్యాచ్‌లు జూన్ 26,28వ తేదిల్లో బెల్‌ఫాస్ట్ వేదికగా జరగనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభం కానున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026 ఛాంపియన్స్‌గా నిలిచిన తర్వాత భారత్‌కు ఇదే తొలి టీ20 సిరీస్ కావడం గమనార్హం. వాస్తవానికి ఈ సిరీస్ టీమిండియా 'ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్'లో లేదు. ఐపీఎల్-2026 సీజన్ ముగిసిన తర్వాత టీమిండియా స్వదేశంలో అఫ్గానిస్థాన్ తో ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడనుంది. జూన్ 6-20 మధ్య టీమిండియా- ఆఫ్గనిస్థాన్ మధ్య సిరీస్ జరుగుతుంది. ఆ తర్వాత ఐర్లాండ్ వెళ్లనుంది. అక్కడ రెండు టీ20 మ్యాచుల అనంతరం జూలైలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లేలా ముందుగా షెడ్యూల్ ఖరారైంది. గత ఎనిమిదేళ్లలో (2018, 2022, 2023) భారత్ మూడుసార్లు ఐర్లాండ్‌లో పర్యటించింది. అయితే దాదాపు 19 ఏళ్ల తర్వాత బెల్‌ఫాస్ట్ మైదానంలో భారత్ తిరిగి ఆడనుంది. ఈ గ్రౌండ్‌లో 2007లో చివరి సారిగా భారత్, ఐర్లాండ్‌తో తలపడింది.




# 'కేడీ' పాటపై కేంద్రం నిషేధం.. నటి నోరా ఫతేహీపై ఫత్వా జారీ



కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్'లోని 'సర్కే చునార్ తేరి సర్కే' అనే ప్రత్యేక గీతం దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన 'దారుల్ ఇఫ్తా' అనే ముస్లిం మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. మరోవైపు వెల్లువెత్తుతున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ధ్రువీకరించారు. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని, ఇటువంటి ప్రదర్శనలు సమాజంలోకి తప్పుడు సందేశాన్ని పంపుతాయని దారుల్ ఇఫ్తా సంస్థ తన ఫత్వాలో పేర్కొంది. ముఖ్యంగా ముస్లిం యువతను ఈ పాట తప్పుదోవ పట్టించేలా ఉందని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలోనే నోరా ఫతేహీపై ఫత్వా జారీ చేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ వివాదంపై నటి నోరా ఫతేహీ స్పందిస్తూ తన వివరణ ఇచ్చారు. మూడేళ్ల క్రితం ఈ పాటలో నటించేందుకు అంగీకరించానని, సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి పనిచేసే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ పాటకు రీమేక్ కావడంతోనే ఒప్పుకున్నానని తెలిపారు. తనకు కన్నడ భాష రాదని, అప్పట్లో చిత్రబృందం చెప్పిన అనువాదం అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె స్పష్టం చేశారు. ఇస్లామిక్ పండితులు ఏదైనా ఒక అంశంపై ఇచ్చే అభిప్రాయం లేదా మతపరమైన తీర్పునే 'ఫత్వా' అంటారు. అయితే, భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో ఫత్వాలకు ఎలాంటి చట్టపరమైన గుర్తింపు లేదు. ఫత్వా జారీ చేసినంత మాత్రాన పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేరు. అలాగ్ న్యాయస్థానాలు దానిని ఆధారంగా తీసుకోవు. ఇది కేవలం ఒక మతపరమైన అభిప్రాయం మాత్రమే. ఇక్కడ భారత రాజ్యాంగం, దేశ చట్టాలే అత్యున్నతమైనవి. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'వంద దేవుళ్లు' చిత్రం ఫస్ట్ లుక్ విడుదల



కోలీవుడ్ హీరో విజయ్ ఆంటోని నటిస్తున్న తాజా చిత్రం 'వంద దేవుళ్లు'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ నటుడు మంచు విష్ణు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ ఫస్ట్ లుక్‌ను పంచుకుంటూ మంచు విష్ణు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నిజమైన భావోద్వేగాలు, కుటుంబం చుట్టూ సాగే ప్రయాణం ఇది. వారు జీవించిన జీవితమే ఈ కథ. 'వంద దేవుళ్లు' ఫస్ట్ లుక్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. ఈ లుక్ చాలా ఇంటెన్స్‌గా, హృద్యంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని 'ఫ్యామిలీ బయోపిక్' అని అభివర్ణించారు.

ఈ సందర్భంగా కథానాయకుడు విజయ్ ఆంటోని, దర్శకుడు శశి, నటి శ్వాసికతో పాటు చిత్ర యూనిట్ మొత్తానికి ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. విభిన్నమైన కథాంశాలతో అలరించే విజయ్ ఆంటోని, ఈసారి కూడా ఒక ఆసక్తికరమైన చిత్రంతో రాబోతున్నారని ఈ లుక్ స్పష్టం చేస్తోంది.






# 'రాకాస'తో వస్తున్న నిహారిక



మెగా ఎ.ా్య వి ం లీ నుంచి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిహారిక కొణిదెల ఇప్పుడు ఫుల్ జోష్‌లో ఉన్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై ఆమె నిర్మించిన 'కమిటీ కుర్రాళ్ళు' భారీ విజయం సాధించడంతో, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'రాకాస'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు.

సంగీత్ శోభన్ హీరోగా నటించిన ఈ చిత్రంపై నిహారిక ధీమాగా ఉన్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఇది ఒక 'హర్రర్ కామెడీ ప్లస్ ఫాంటసీ' జానర్‌లో తెరకెక్కిన సినిమా. కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా క్లీన్ ఎంటర్‌టైనర్‌గా దీనిని రూపొందించామని నిహారిక తెలిపారు. ఇప్పటికే సంగీత్ శోభన్‌తో 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' వంటి హిట్ వెబ్ సిరీస్ నిహారిక నిర్మించారు. ఇప్పుడు అదే కాంబోలో సినిమాతో వస్తుండటం విశేషం.

ప్రస్తుతం నటనకు దూరంగా ఉన్న నిహారిక, మళ్లీ మేకప్ వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాజాగా ప్రమోషన్లలో ఆమె మాట్లాడుతూ తన సెకండ్ ఇన్నింగ్స్ గురించి క్లారిటీ ఇచ్చారు. గత కొంతకాలంగా అనేక కథలు వింటున్నానని, అందులో కొన్ని స్క్రిప్ట్స్ తనకు బాగా నచ్చాయని చెప్పారు. అన్నీ కుదిరితే 2027లో మళ్లీ హీరోయిన్‌గా వెండితెరపై కనిపించే అవకాశం ఉందని ఈ మెగా ముద్దుగుమ్మ వెల్లడించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**